

కొడంగల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, సబితారెడ్డి, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, దేశపతి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

# రైతుల కోసం సుప్రీంకోర్టుకు!

మొదటిపేజీ తరువాయి...

ప్రశ్నించిన పట్నం నరేందర్‌రెడ్డిని 35 రోజులుగా జైలులో పెట్టి రాక్షసానందం పొందుతున్నారని ధ్వజమెత్తారు. బాధిత రైతాంగానికి బీ ఆర్ ఎస్ దండు, కేసీఆర్ దళం అండగా ఉం టుందని భరోసా ఇచ్చారు. అటు కోర్టులో, ఇటు అసెంబ్లీలో పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు.

### దమ్ముంటే ఫార్ములా–ఈపై చర్చ పెట్టు

'రేవంత్‌రెడ్డీ.. అరెస్ట్, అరెస్ట్ అంటూ భయపెట్టుడు కాదు. నీకు దమ్ముంటే కనీసం 15 రోజులు అసెంబ్లీని నిర్వహించు. పది రోజులు ప్రజా సమస్యలపై మిగిలిన ఐదు రోజులు మీరు ఆరోపిస్తున్న ఫార్ములా–ఈ పై చర్చపెట్టు' అని కేటీఆర్ సవాల్ విసిరారు. 'ఏ ప్రభుత్వం పైనైనా మూడు, నాలుగేండ్లలో వ్యతిరేకత వస్తది. కానీ, నక్కజిత్తుల రేవంత్‌రెడ్డి రంగు ఏడాదిలోనే బయటపడ్డది' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి క్యాబినెట్ మీటింగ్‌లో ప్రజా సమస్యలను గాలికొదిలి వీరిని అరెస్ట్ చేయాలా? వారిని జైలులో పెట్టాలా? అనే అంశాలపై చర్చిస్తున్నారని ఆరోపించారు. లగచర్ల నుంచే రేవంత్‌రెడ్డి పతనం మొదలు కానున్నదని చెప్పారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను అరిగోస పెడుతున్నదని విమర్శించారు. 30 శాతం మందికే రుణమాఫీ చేసి, వానకాలం రైతుబంధు ఎగ్గొట్టి రైతులను నిండా ముంచిందని మండిపడ్డారు. ఈ విషయంపై రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లెతో పాటు రాష్ట్రంలోని ఏ ఊరిలోనైనా చర్చించేందుకు సిద్ధమేనని సవాల్ విసిరితే ముఖ్యమంత్రి పారిపోయారని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో అటు రాహుల్‌గాంధీ నుంచి కాంగ్రెస్ కార్యకర్త దాకా అందరూ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. అటు ఆటో డ్రైవర్ల నుంచి మొదలుకొని ఇటు పాఠశాల విద్యార్థుల వరకు అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కొడంగల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కేటీఆర్

### రాజ్యాంగేతర శక్తిగా తిరుపతిరెడ్డి

కొడంగల్‌లో ఇండస్ట్రియల్ కారిడార్ పెడతామని ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ, అల్లుడి ఫార్మా కంపెనీల కోసమే రైతుల భూములను గుంజుకుంటున్నారని ఆరోపించారు. కనీసం వార్డు మెంబర్ కూడా కానీ ముఖ్యమంత్రి అన్న తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా మారారని నిప్పులు చెరిగారు. పోలీసులు, అధికారులను వెంటబెట్టుకొని తిరుగుతూ అరాచకాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. భూములివ్వబోమన్న పాపానికి లగచర్ల రైతులను అర్ధరాత్రి అరెస్ట్ చేయించారని ధ్వజమెత్తారు.

## రేవంత్ అసెంబ్లీలో కనిపిస్తలేరు: సబితా



**అసెంబ్లీలో** లగచర్ల ఘటనపై చర్చించాలని బీఆర్ఎస్ పట్టుబడుతుంటే ప్రభుత్వం పారిపోతున్నదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రెండు రోజుల నుంచి ముఖ్యమంత్రి అసెంబ్లీలో కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజాసమస్యలపై నిలదీస్తూ సర్కారుకు కొరకరాని కొయ్యలా మారిన కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు సీఎం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి దుర్మార్గాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.

### పిల్లాడి పోస్ట్‌కే తట్టుకోలేని సీఎంకు కేసీఆర్ కావాలా?

పిల్లాడు సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే తట్టుకోలేని రేవంత్‌రెడ్డి తమ పార్టీ అధినేతను అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేయడం విడ్డూరమన్నారు. తమకే సమాధానం చెప్పలేక పారిపోతున్న ఆయనకు కేసీఆర్ ఎందుకని ప్రశ్నించారు. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో లగచర్ల ఘటనపై చర్చించాలని డిమాండ్ చేశారు. అత్యంత ముఖ్యమైన సమస్యలను పక్కనబెట్టి టూరిజంపై చర్చపెట్టడం ఆయనకే చెల్లిందని ఎద్దేవా చేశారు.

### రాష్ట్రంలో అరెస్ట్‌ల పాలనా?

ప్రజాపాలన అని చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి అరెస్ట్‌ల పాలన సాగిస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల మెట్రోకు నష్టం వస్తున్నదని చెప్పిన ఎల్‌అండ్‌టీ ఎండీని అరెస్ట్ చేస్తామని బెదిరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమా ఫంక్షన్‌లో తన పేరు మరిచిపోయినందుకు సినిమా నటుడిని జైల్లో పెట్టిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. ఫార్మా వద్దన్న సొంత నియోజకవర్గ రైతులతో పాటు కులగణన సర్వేకు వెళ్లిన పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రావును జైలుకు పంపారని విమర్శించారు. ఫార్మా కోసం తొండలు కూడా గుడ్లుపెట్టని భూములు తీసుకుంటున్నామని అబద్ధాలు చెప్పిన ముఖ్యమంత్రికి ఓ గిరిజన ఆడబిడ్డ ఆ భూముల్లో పండిన వడ్ల రాశులను చూపించి బుద్ధిచెప్పిందని గుర్తుచేశారు. చేతులకు సంకెళ్లు వేసుకొని అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నిరసన తెలిపి ఈ సమస్యను ఎలుగెత్తిచాటారని గుర్తుచేశారు.

### లగచర్ల నుంచే ప్రతిఘటన మొదలు: దేశపతి శ్రీనివాస్

సీఎం సొంత నియోజకవర్గంలోని లగచర్ల లంబాడీ బిడ్డల నుంచే ప్రజాపాలనకు ప్రతిఘటన మొదలైందని ఎమ్మెల్సీ దేవపతి శ్రీనివాస్ అన్నారు. లగచర్లపై అసెంబ్లీలో చర్చ పెట్టమని అడిగితే టూరిజాన్ని ముందుకుతెచ్చి తప్పించుకుంటున్నారని దెప్పిపొడిచారు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ఆయన రంగు వెలిసిపోయిందని విమర్శించారు. దగాపడ్డ లంబాడీ బిడ్డలను ఢిల్లీకి తీసుకెళ్లి సర్కారు అరాచకాలను ప్రపంచానికి తెలియజెప్పిన గొప్పనేత కేటీఆర్ అని అభినందించారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా లగచర్ల బాధితులకు గులాబీ జెండా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



## కాలేటి కడుపుల మీద పలుగు రాళ్లు కొట్టిన్రు: గోరటి వెంకన్న

'భూములివ్వబోమన్న పాపానికి లగచర్ల గిరిజన బిడ్డలను సర్కారు నిర్బంధించడం సరికాదు. ఇదేం ప్రజాస్వామ్యం' అంటూ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆక్షేపించారు. కాలేటి కడుపుల మీద పలుగు రాళ్లు కొట్టుడెందుకని నిలదీశారు. 'నీకు దమ్ముంటే బలిసినోళ్లను కొట్టు. అంతేగానీ గిరిబిడ్డల జోలికిరావద్దు' అని హితవు పలికారు. గుండెపోటు వచ్చిన రైతును పోలీసులు కొట్టుకుంటూ తీసుకెళ్లడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలి వీచే లగచర్లలో ఫార్మా చిచ్చుపెట్టారని మండిపడ్డారు. ఈ ప్రాంతానికి ఘనమైన పోరాట చరిత్ర ఉన్నదని, అదే స్ఫూర్తితో గిరిజన బిడ్డలు కొట్లాడారని అభినందించారు. బాధిత రైతులకు కేటీఆర్‌తో పాటు కవులు, కళాకారులు అండగా ఉంటారని తేల్చిచెప్పారు. సర్కారు అనాగరిక పద్ధతులను ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు.

### లగచర్ల పోరాటం స్ఫూర్తిదాయకం: ఆర్ఎస్

ఫార్మా కంపెనీకి భూములివ్వబోమని లగచర్ల రైతులు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. తెలంగాణనే కాదు దేశరాజకీయాలను మార్చే శక్తి, సత్తా ఈ పోరాటానికి ఉన్నదని చెప్పారు. లగచర్ల రైతుల ఉద్యమాన్ని చూస్తుంటే 1948లో జరిగిన సాయుధ పోరాటం గుర్తుకు వస్తున్నదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, మెతుకు ఆనంద్, నేతలు పొన్నాల లక్ష్మయ్య, గజ్జెల నగేశ్, కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గెలిపించిన పాపానికి అరాచకాలు: సత్యవతి రాథోడ్

**రేవంత్‌రెడ్డి** మాయమాటలు నమ్మి గెలిపించిన పాపానికి గిరిజనులను అరిగోస పెడుతున్నారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. ఉపాధి కల్పించాల్సిన ఆయన భూములు గుంజుకొని అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఇక్కడి ప్రజలు, నరేందర్‌రెడ్డి కలిసి తనను ఓడించారనే అవమానంతో ముఖ్యమంత్రి ఇప్పుడు కక్ష తీర్చుకుంటున్నారని ఆరోపించారు. దురహకారంతో ఇలాంటి దుశ్చర్యలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి గిరిజనులు తిరగబడిన తీరు చూసి చివరికి ఫార్మాను వెనక్కి తీసుకున్నారని ఎద్దేవా చేశారు.

## దమ్ముంటే లగచర్లపై చర్చ పెట్టండి!

### దొంగ రాతలు రాయించుడు బంద్ చెయ్యి రేవంత్: జగదీశ్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే అసెంబ్లీలో లగచర్లపై చర్చపెట్టాలని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స వాల్ చేశారు. చర్చకు రెండు రోజులుగా తాము పట్టుబడుతుంటే సర్కార్ పారిపో తున్నదని ఎద్దేవాచేశారు. శాసనసభను కాంగ్రెస్ వాళ్లు అబద్ధాలు చెప్పుకొనే వేదికగా మార్చారని విమర్శించారు. జనగా మ, బోథ్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రె డ్డి, అనిల్‌జాదవ్‌తో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డికి నేరుగా మమ్మల్ని ఎదుర్కొనే ధైర్యం లేక కేటీఆర్ గురించి లీకు లిచ్చి అనుకూల మీడియాలో దొంగ రా తలు రాయించి బతుకుతున్నడు. ఇలాం టి రాతలు బంద్ చెయ్యి రేవంత్' అంటూ విరుచుకుపడ్డారు. దమ్ముంటే శాసనసభను పదిహేను రోజులు నడపాలని సవాల్ చేశారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) మీటింగ్ లేకుండా బిల్లులు ప్రవేశపెట్టడం ఏమిటని, ఇది అసెంబ్లీ సమావేశాల సంప్రదాయాలకు విరుద్ధమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.



# మరో లగచర్ల.. పలిమెల

మొదటిపేజీ తరువాయి...

శీనుబాబు కీలకంగా వ్యవహరిస్తున్నాడని రైతులు మండిపడుతున్నారు. కొత్తగా పెట్టే సిమెంటు ఫ్యాక్టరీలో సగం వాటా కోసమే ఇదంతా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

### 300 ఎకరాలకు ఎసరు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి సమీపంలోని పలిమెల మండల కేంద్రంలోని పచ్చని పంట భూములను సిమెంట్ పరిశ్రమకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వేగంగా పావులు కదుపుతున్నారు. సుమారు 300 ఎకరాల పేదల భూమికి ఎసరు పెట్టిన ఆయన, రైతులకు తెలియకుండానే వారికి చెందిన సుమారు 200 ఎకరాల భూమిని కొన్నేండ్ల కిందటే తన అనుచరులైన కాంగ్రెస్ నేతల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఇప్పుడు వారి నుంచి దక్కన్ సిమెంట్ పేరు మీదికి మళ్లీ రిజిస్ట్రేషన్ చేస్తుండడంతో విషయం కాస్తా రైతులకు చేరింది. తమ జీవనాధారమైన భూములు పోతున్నాయని తెలిసి రైతులు ఒక్కసారిగా గగ్గోలు పెడుతున్నారు. భూములను కాపాడుకునేందుకు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ప్రాణాలు పోయినా తమ భూములను వదులుకునేది లేదని తేల్చిచెప్తున్నారు.

### 2008లోనే మొదలు

పలిమెల మండల కేంద్రం (గతంలో మహదేవపూర్ మండలంలోని గ్రామం) శివారులో 26 వేర్వేరు సర్వే నంబర్లలో ఉన్న సీలింగ్ భూములను బోడాయిగూడెం, పంకెన, పలిమెలకు చెందిన సుమారు 150 మంది దళిత, గిరిజన రైతులు 60 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నారు. మాజీ పట్వారీ ఉప్పు లక్ష్మణ్‌రావు, భూస్వాములు పాషాదొర, ఊర జగన్నాథరావు, జంగు సిపాయి ఖాజా నసీరొద్దీన్ పేర్లతో ఈ భూములు ఉండేవి. 1975–76లో వచ్చిన సీలింగ్ చట్టంతో వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. 60 ఏండ్లుగా రైతులు ఈ భూముల్లో సాగు చేసుకుంటున్నారు. మోకాపై, కాస్తులో ఉన్న రైతుల గురించి విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు, ఆ తర్వాత కొందరికి తోక పాస్ పుస్తకాలు ఇచ్చారు. 30 ఏండ్ల క్రితం గోదావరి ఉప్పొంగి ఊరు మునిగి రైతులు నిరాశ్రయులయ్యారు. ఆ తర్వాత అధికారులు సీలింగ్ భూములను అక్రమంగా విరాసత్ చేసి బోగస్ పట్టాలు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి. పలిమెల శివారులోని పేదలు కాస్తు చేసుకుంటున్న భూములను 2008లో కాంగ్రెస్ నేతలు తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మంత్రి సొంత ఊరు ధన్వాడతోపాటు మంథని నియోజకవర్గంలోని లద్నాపూర్, కేశవపల్లి, 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నేతలు, అనుచరుల పేరిట ఈ భూములను అప్పట్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తమకు తెలియకుండా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ కావడంపై అప్పటినుంచీ రైతులు ఆందోళన చేస్తూ వస్తున్నారు. 16 ఏండ్ల క్రితం తమ పేరిట భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్న కాంగ్రెస్ నాయకులు, మంత్రి అనుచరులు రెండుమూడు రోజులుగా ఈ భూములను దక్కన్ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. రైతులకు ఈ సమాచారం తెలియడంతో ఆందోళనకు దిగారు. సీలింగ్ భూములను అక్రమంగా విరాసత్ పట్టాలు సృష్టించి ఇప్పుడు కాంగ్రెస్ నేతల పేర్ల మీదికి, ఆ తర్వాత కంపెనీకి అమ్మినట్టు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.


### సబ్‌కలెక్టర్ విచారణ

భూ దందాపై పలిమెలలోని రైతులు ఆగ్రహం వ్యక్త చేస్తూ నిరసనలకు సిద్ధం కావడంతో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ మంగళవారం పలిమెల రైతువేదిక వద్ద రైతులతో మాట్లాడారు. ఎంతమంది రైతులు, ఎన్నేండ్లుగా సాగు(కాస్తు)లో ఉన్నారని తెలుసుకున్నారు. రైతుల వాంగ్మూలాన్ని రికార్డు చేసుకున్నారు. భూములను దక్కన్ కంపెనీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించిన పలిమెల తహసీల్దార్ విచారణలో ఎక్కడా కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. పలిమెల తహసీల్దార్ వివరణ కోరగా భూములు దాదాపు 50 ఏండ్లుగా కాస్తులో ఉన్నది వాస్తవమేనని, రికార్డుల్లో ఇతరుల పేర్లు ఉన్నాయని చెప్పారు.

## కంపెనీలో శీనుబాబుకు సగం వాటా!

**దక్కన్** సిమెంట్ కంపెనీలో మంత్రి శ్రీధర్‌రాబు తమ్ముడు శీనుబాబు 50 శాతం వాటాకు ఒప్పందం కుదుర్చుకొని పేదల భూములను పణంగా పెట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. 2008లో మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు తన అనుచరుల పేరిట 202 ఎకరాలు, మరో 100 ఎకరాలు ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని రైతులు చెప్తున్నారు. ధరణి వ్యవస్థను కాంగ్రెస్ భూమాతగా మారుస్తున్న నేపథ్యంలో అందులో కాస్తుకాలం, కబ్జా కాలం పెట్టే అవకాశాలున్నాయన్న సమాచారంతో మంత్రి శ్రీధర్ బాబు, అనుచరుల పేరిట ఉన్న భూములను దక్కన్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయించడం మొదలుపెట్టారని చెప్తున్నారు. ఇప్పటివరకు 102.35 ఎకరాల భూమి దక్కన్ సిమెంట్స్‌కు ధారాదత్తం అయింది. రైతుల నిరసనలకు భయపడి తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిసింది.

## మా జీవితాలతో ఆడుకోవద్దు



*మా అసొంటి పేదల జీవితాలతో ఆడుకోవద్దు. మా భూములు మాగ్గాకుండ జేస్తరా? మాకు తెలియకుండా వేరేవాళ్ల పేర్ల మీదికి ఎట్ల రిజిస్ట్రేసన్ చేస్తరు? మా అమ్మ, అమ్మమ్మ నుంచి ఈ భూమిని నమ్ముకొని బతుకుతున్నం. మా భూముల జోలికొస్తే ఊరుకునేది లేదు.*

*-పాగె లక్ష్మి, పంకెన*

## శీనుబాబుకు 50% వాటా కోసమే: పుట్ట మధు

మంత్రి శ్రీధర్‌బాబు తమ్ముడు శీనుబాబుకు దక్కన్ సిమెంట్ కంపెనీలో 50 శాతం వాటాకు ఒప్పందం కుదుర్చుకొని పేదల భూములను అక్రమంగా.. అప్పనంగా కట్టబెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. బాధిత రైతులతో కలిసి మంగళవారం ఆయన పలిమెలకు వెళ్లి భూములను పరిశీలించారు. కాస్తులో ఉన్న భూములను మంత్రి శ్రీధర్‌బాబు తన అనుచరులైన వనం రాంచందర్‌రావు, చొప్పరి సదానందం, రొడ్డ బాపు, బండారి సదానందం, బొల్లపల్లి వెంకటస్వామిగౌడ్, పులి రాజేశం, తుల్సెగారి తిరుపతి, పున్నం మధుకర్‌రెడ్డి, చల్లా జక్కిరెడ్డితోపాటు మరి కొంత మంది పేరిట 2008లో రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు 200 ఎకరాల వరకు మహ్మద్ కమాలుద్దీన్ అనే వ్యక్తి ద్వారా మంథనిలో రిజిస్ట్రేషన్ చేయించారని చెప్పారు. రైతుల కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు.

## రేవంత్ సర్కారు రాక్షసానందం

- 35 రోజులుగా రైతుల నిర్బంధం
- ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
- బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): లాగచర్ల గిరిజన రైతులను అక్రమంగా జైలులో నిర్బంధించి, థర్డ్ డిగ్రీలు ప్రయోగించి రేవంత్‌రెడ్డి సర్కారు రాక్షసానందం పొందుతున్నదని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం, అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించే చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన ఖైరతాబాద్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహా విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, 35 రోజులుగా లగచర్ల గిరిజన రైతుల అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తూ గిరిజన రైతులకు అవసరమైన బెయిల్ రాకుండా అవరోధాలు సృష్టిస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో మన్నె కవిత, మన్నె గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విప్లవ్ పాల్గొన్నారు.

# లగచర్లపై ఊరూరా నిరసనలు

## సర్కార్ తీరుపై అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ శ్రేణుల వినతిపత్రాలు


లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి, థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించడాన్ని ఖండిస్తూ మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఊరూరా అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయా చోట్ల అంబేద్కర్ విగ్రహాలను వినతి పత్రాలు సమర్పించారు. -నమస్తే తెలంగాణ నెట్‌వర్క్




మహబూబ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో బీఆర్ఎస్ నాయకులు




నల్లగొండ జిల్లా దేవరకొండలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్




మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



జనగామ జిల్లా దేవరుప్పలలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ నేతలు



ఆలేరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



మెదక్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు